క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఏకాహం

మునగపాక : స్థానిక సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న ఏకాహం శుక్రవారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా వారం రోజుల పాటు ఏకాహం నిర్వహించడంలో భాగంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని భజనలు, కీర్తనలు ఆలపించారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్ర తెలిపారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్లు ప్రదర్శిస్తున్న మూలపేట గ్రామస్తులు

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రమణి కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం 104 సేవలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఆడారి జగన్నాథరావు, ఈశ్వర అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందు గ్రామంలో ఆరోగ్య సూత్రాలకు సంబంధించి పోస్టర్ల ప్రదర్శన నిర్వహించారు.

మునగపాకలో వాహన తనిఖీలు


మునగపాకలో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక : ప్రతి వాహనదారుడు రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు వహించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. వాహన తనిఖీల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆయన మునగపాక మెయిన్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపినా అలాగే హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. అలాగే అతివేగం అత్యంత ప్రమాదకరమన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐలు మన్మదరావు, రామకృష్ణ,దేవన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

పాయకరావుపేట : వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు వహించాలని నర్సీపట్నం డీఎల్‌పిఓ జి.ఎస్.ఎస్.ఎన్ మూర్తి అన్నారు. ఆయన పట్టణంలో గల ఇందిరా కాలనీలో గల అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పై వైద్య సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈయనతో పాటు ఈవోఆర్‌డీ సిహెచ్ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అనకాపల్లి: శంకరం పంచాయతీలో ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ అభివృద్ధి పనులను కార్తీకమాసంలోగా పూర్తిచేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో జాప్యం నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు, పురాతత్వశాఖ అధికారులు, కలెక్టర్ దృష్టి సారించి అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయాల్సిందిగా కోరారు.

54 మంది వృద్ధులకు కంటి పరీక్షలు

కె.కోటపాడు: కంటి సమస్యలున్న వారికి మెరుగైన వైద్యం అందించడానికి ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు బిషప్ ఎస్.మోజేష్ తెలిపారు. హోలీ లీల్ క్రైస్ట్ చర్చ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం వి.సంతపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వి.సంతపాలెం, వారాడ, ఆనందపురం గ్రామాలకు చెందిన 54 మంది వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు తీసుకున్నారు. వీరికి విశాఖపట్నానికి చెందిన విజన్ కేర్ ఆస్పత్రి సిబ్బంది...


రాంబిల్లిలో కురుస్తున్న వర్షం


తుపాను కారణంగా తీరంలో నిలిచిన బోట్లు


మునగపాక మండల పరిషత్ సముదాయానికి వెళ్లేమార్గంలో నిలిచిన వర్షపునీరు


పట్టణంలో కురిసిన భారీ వర్షానికి రైల్వేస్టేషన్ రోడ్డుపై చేరిన వర్షపునీరు

- వాగులు,పంటకాలువల్లోకి చేరిన వర్షపు నీరు
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- ఏరువాక పనులకు రైతులు సన్నద్ధం

తెరిపివ్వని వాన


యండపల్లి శివారున మెయిన్‌రోడ్డులో పారుతున్న వర్షపు నీరు


యలమంచిలి మండలం రేగుపాలెం వద్ద పాతజాతీయ రహదారిపై మోకాలి లోతులో వరదనీరు


జలమయమైన యలమంచిలి పట్టణంలో పెదపల్లి రోడ్డు

రాంబిల్లి :(యలమంచిలి)బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా శుక్రవారం తెల్లవారుజాము నుండి మండలంలో తెరిపివ్వకుండా వర్షం కురిసింది.ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలో పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం సెలవుదినం ప్రకటించింది.అధికారులు ముందస్తు సూచనలు మేరకు మత్స్యకార గ్రామాలు అయిన వాడనర్సాపురం ,కొత్తపట్నం,వెంకయ్యపాలెం,గజిరెడ్డిపాలెం ,వాడపాలెంలో మత్స్యకారులు సముద్రంలో అలల తాకిడి కారణంగా వేటకు దురంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. వేటను నిషేదించి మత్స్యకారులు ఇళ్లకే పరిమితమ్యారు.అక్కడక్కడ రహదారులుపై నీరు ప్రవాహించింది.రాంబిల్లిలో సముద్రంలో తుఫాన్ తాకిడికి అలలు ఉధృతంగా ఎగసిపడ్డాయి,సుముద్ర తీర ప్రాంతం వద్ద కోల్లలంగా మారింది. తుఫాన్ కారణంగా జనజీవనం ఎక్కడిక్కడే స్తంబించిపోయింది,అలాగే మండలంలో శారద నది ,మైనర్‌శారదాలోకి వర్షం నీరు అధికంగా చేరింది.నదులు కాలువలు,చెరువుల్లోకి నీరు ఎక్కువగా చేరడంతో వ్యవసాయ పనులు కు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఖరీఫ్ పంటల సాగులో భాగంగా వరి పొలాలను దుక్కులు దున్ని నాటులు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు.తుఫాన్ ప్రభావంతో తీర ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపట్టడానికి అధికార యంత్రంగా అధికారులకు పలు సూచలిచ్చారు.రైతులందరూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయిమయ్యాయి.

రోజంతా ముసురు

మునగపాక: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా మండల వ్యాప్తంగా ముసురు నెలకొంది. భారీ వర్షం కురవకపోయినా ఆడపా దడపా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో కొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోతుంది. అలాగే మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో వర్షపునీరు నిలిచిపోయింది. సాగునీటి కాలువల్లోకి వర్షపునీరు వచ్చి చేరుతుంది. ఈ వర్షం వ్యవసాయానికి మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి తెలిపారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

మునగపాక: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ పాపారావు కోరారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు వీఆర్వోలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అలాగే డయేరియా. డెంగ్యూ వంటి వ్యాధులు సంభవించకుండా పారిశుద్యం మెరుగుపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ వినయ్ పాల్గొన్నారు.

స్తంభించిన జనజీవనం

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో యలమంచిలి పట్టణం,మండలంలో గురువారం రాత్రి నుంచీ శుక్రవారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది.పల్లపు ప్రాంతాలు జలమమమయ్యాయి. కొన్నిచోట్ల రహదారులపై నీరు నిలిచిపోయింది. ముసురు వర్షానికి ఫుట్‌పాత్, వీధి,చిరువ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు. జనం లేక మార్కెట్లు వెలవెలబోయాయి. బస్టాండు, కోర్టుపేటల్లో చెత్తకుండీల నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో అటుగా వెళ్లే జనం,ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలు నారుమడులకు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు. వరి పైరు సాగులో ఉన్న పొలాల్లో వర్షపు నీరు బయటకు పోయేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

యలమంచిలిలో గురువారం రాత్రి 8.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు 4.7 సెంటీమీటర్లు, శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 2.5 సెంటీమీటర్లు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కమతాలు పదునెక్కడంతో ఖరీఫ్ వరి నాట్లు వేసేందుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లాలో తహసీల్దార్లతో శుక్రవారం ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో 24 గంటలు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్లకు సూచించారు. యలమంచిలి తహసీల్దార్ ఆర్ అప్పలరాజు వీఆర్వోలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. వీఆర్వోలు ఆయా గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు స్వయంగా తెలుసుకోవాలన్నారు. మండలంలో లోతట్టు ప్రాంతాలు, శిధిల భవనాలు, గుడిసెలు,ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను గుర్తించి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నదీ తీర గ్రామాలైన ఏటికొప్పాక, జంపపాలెంలో వరహానది,శారదానదుల్లో నీటి ప్రవాహ ఉధృతిని తెలుసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే తనకు సమాచారమివ్వాలని సూచించారు. యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ అప్పలరాజు సాక్షికి తెలిపారు. భారీ వర్షాలకు సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు మండల హెచ్‌డీటీ 7702290196, ఆర్‌ఐ 7013294671 కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు.

కోటవురట్ల : అల్పపీడన ప్రభావంతో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు మూతపడ్డాయి. కుండపోతగా కురిసిన వర్షంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. జల్లూరు మెయిన్‌రోడ్డు, కోటవురట్లలో ఎంపీడీవో కార్యాలయం వద్ద మెయిన్‌రోడ్డు చెరువులను తలపించాయి.

మునగపాక(అచ్యుతాపురం): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. కాగా పూడిమడక సముద్రతీరం ప్రశాంతంగా ఉంది.ఈ వర్షాలు వ్యవసాయ పంటలకు మేలు చేస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా


జాబ్ మేళాకు హాజరైన రెండు జిల్లాల అభ్యర్థులు

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలకు చెందిన నిరుద్యోగులు హాజరైనట్లు తెలిపారు. 156 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరైనట్లు తెలిపారు. 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి 116 మందిని ఎంపిక చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీఐ ట్రైనింగ్ అధికారి, యు.ఎస్.ఎన్. మూర్తి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో తహసీల్దార్ పర్యటన


చినగుమ్ములూరులో వర్షంతో తెప్పరిల్లిన వరినారు


వెంకటాపురంలో ఇటీవల పటిష్టం చేసిన వరాహనది గట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్


సోమిదేవపల్లి వద్ద కోతకు గురయిన గట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎస్.రాయవరం : మండలంలో శుక్రవారం ఎడతెరపు లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అయితే ఈ వర్షాలు ఖరీఫ్ నాట్లు వేసే రైతులకు ఊరటనిచ్చారు. జలమయ ప్రాంతాల్లో పర్యటించిన తహసీల్దార్ విజయలక్ష్మి వెంకటాపురంలో ఇటీవల పనులు చేపట్టిన వరాహనది గట్టును, కోతకు గురయిన సోమిదేవపల్లి గట్టును పరిశీలించారు. ఎస్.రాయవరంలో వరాహనదీ ప్రవాహాన్ని పరిశీలించారు.

23 నుంచి ప్రత్యేక ఆధార్ సేవలు


సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: మండలంలో ఈ నెల 23 నుంచి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. డి.యర్రవరం, ఎం.బి.పట్నం, మన్యపురట్ల, గన్నవరం, గునుపూడి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తగా ఆధార్ కార్డులు పొందాలన్నా, కార్డుల్లో తప్పొప్పులను సరి చేసుకోవాలన్నా ఇది చక్కటి అవకాశమన్నారు. నిబంధనల ప్రకారం చేర్పులు మార్పులు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఎవ్వరూ ఇబ్బంది పెట్టకుండా నిర్ణీత గడువు లోపు ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

మాడుగుల రూరల్: మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ సేవలందిస్తామని ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కె.జె.పురం -1, కె.వల్లాపురం, వీరనారాయణం, లోవ పొన్నవోలు సచివాలయాలల్లో సేవలందిస్తారన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులు, 18 ఏళ్ల లోపు యువత, ఆధార్ పొంది పదేళ్లు దాటిన వారు బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. దీనివల్ల బ్యాంకు రుణాలు, సంక్షేమ పథకాలు పొందడంలో ఆధార్ ఇబ్బందులు ఉండవన్నారు.

నారుమడుల్లో నీరు నిల్వ ఉంచొద్దు

మాకవరపాలెం: నారుమడుల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏవో చిరంజీవి రైతులకు సూచించారు. అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ భూముల్లో అధికంగా నీరు చేరింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం విత్తనాలు చల్లుకున్న నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. అలా చేయకుంటే విత్తనాలు మొలకెత్తవన్నారు. ఈ విషయంలో రైతులు తమ సూచనలు పాటించాలన్నారు.

రోలుగుంట: ఆకుమడుల్లో నీటి నిల్వలు లేకుండా సంరక్షించుకోవాలని ఏవో ఎస్.విజయలక్ష్మి రైతులకు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆకుమడుల్లో వర్షపు నీరు లేకుండా బయటకు పోయే మార్గం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ ఉపకరణాలతో జాగ్రత్త

ఎస్.రాయవరం : తుపాను సమయాల్లో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ సూచించారు. ఇళ్లలో గృహోపకరణాలు స్విచ్ఛ్ ఆఫ్ మోడ్‌లో పెట్టాలన్నారు. చినపిల్లలను కరెంటు వస్తువులు తాకనీయకుండా చూడాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాల స్టే వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడయిన వైర్లు తెగిపడినా వెంటనే విద్యుత్ కేంద్రాలకు సకాలంలో సమాచారం ఇవ్వాలన్నారు.

ఏపీజీవీబీ మేనేజర్‌గా మహేశ్వర్రావు

రోలుగుంట: స్థానిక ఏపీజీవీబీ మేనేజర్‌గా పి.మహేశ్వర్రావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈయన బొబ్బిలి బ్యాంకులో మేనేజర్‌గా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చి శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందితో కలసి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఖాతాదారులు తమ సేవలు సద్వినియోగం చేసుకుని బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన నందిని సాహు రెండు మాసాల క్రితమే బదిలీ అయ్యారు.

మారేపల్లిలో గిరి ప్రదక్షిణ నేడు


శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

దేవరాపల్లి: మారేపల్లిలో ఉత్తర వాహిని శారదానది తీరాన వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వాక ముత్యాలమ్మ తల్లి జంక్షన్, వెంకటరాజుపురం, తెనుగుపూడి, భీమలింగేశ్వర స్వామి ఆలయం, మారేపల్లి బీసీ కాలనీ మీదుగా పాండవుల మెట్ట స్వామివారి ఆలయం వద్దకు గిరి ప్రదక్షిణ చేరుకుంటుందన్నారు. ఏడు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో జరుగుతుందన్నారు. శనివారం సాయంత్రం 4 గంటల ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆకుకూరలతో కంటి ఆరోగ్యం భద్రం


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా పదో అదనపు న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి: నిర్ణీత వయసు దాటిన వారు ఏటా కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచన మేరకు కంటి అద్దాలను వాడాలని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు వేద నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఐకేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిత్యం ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం వలన కంటి సమస్యల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. న్యాయమూర్తులు ఎ.రమేష్, విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా, సహాయకార్యదర్శి తులసి పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరి చేస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక ఎంఈవో కార్యాలయ దరి ఒరిగిన విద్యుత్ స్తంభంతో పలువురు ఆందోళనకు గురవుతున్నారు. ఎపుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని కలవరపడుతున్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 19న ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం పేరిట కథనం రావడంతో విద్యుత్ శాఖ ఏఈ గోపీ స్పందించారు. సిబ్బందితో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరి చేయించారు. ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైతులు అలాగే పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షాలు కురుస్తున్నందున ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ గోపి కోరారు.

రోడ్ల పక్కన చెత్త కుప్పలను తొలగించండి


అరట్లకోటలో చెత్తను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ


నామవరంలో డ్రైనేజీలో పూడికలు తీస్తున్న పంచాయతీ సిబ్బంది

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో రోడ్ల పక్కన వేస్తున్న చెత్త కుప్పలను తొలగించాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ ఆయా గ్రామాల కార్యదర్శులను ఆదేశించారు. ఆయన శుక్రవారం మండలంలో గల అరట్లకోట గ్రామంలో రోడ్డు ప్రక్కన వేస్తున్న చెత్తను పరిశీలించి, తొలగించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. అదే విధంగా నామవరం, పాయకరావుపేట గ్రామాల్లో డ్రైనేజీలు పూడిక నిల్వ లేకుండా తీయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాయకరావుపేట, నామవరం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

1,015 కిలోల గడ్డి విత్తనాలు సిద్ధం


పశువైద్య కేంద్రంలో ఉంచిన గడ్డి విత్తనాలు

కె.కోటపాడు: రైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా అందించేందుకు గడ్డి విత్తనాలు కె.కోటపాడు పశువైద్య కేంద్రానికి చేరుకున్నాయి. 75 శాతం రాయితీపై కాకిజొన్న, మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలను అందించనున్నారు. 280 కిలోల కాకిజొన్న రకం, 735 కిలోల మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఐదు కిలోల బ్యాగ్‌తో అందించనున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. కాకిజొన్న ధర రూ.460 కాగా, రాయితీపై రూ.115కు, మొక్కజొన్న ధర రూ.340 ఉండగా, రూ.85కు అందిస్తామన్నారు. కె.కోటపాడు, కొరువాడ, చౌడువాడ పశువైద్య కేంద్రాలతోపాటు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పశువైద్య సహాయకులను సంప్రదించాలని సూచించారు. రైతులు భూమి పాస్ పుస్తకంతోపాటు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ అందించాలన్నారు.